

హత్యరాల.. బ్రహ్మోత్సవాల వేళ

శైవ క్షేత్రమైన హత్యరాలలో శ్రీకామాక్షి సమేత త్రేతేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు మంగళవారం నుంచి ప్రారంభం కానున్నాయి. -8లో..



దైవ దర్శనానికి వెళ్తుండగా..

దైవ దర్శనానికి వెళ్తున్న వారి కారును ఎదురుగా వస్తున్న లారీ ఢీకొనడంతో ఇద్దరు మృతి చెందారు. -8లో..

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.190	రూ.280
రెండోరకం	రూ.100	రూ.186

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 143 మెట్రిక్ టన్నులు



న్యూస్‌రీల్

రేపు ఆర్టీసీ స్థలాల లీజుపై సమావేశం

మదనపల్లె సిటీ: మదనపల్లె ఆర్టీసీ బస్టాండులో స్థలాలు లీజుకిచ్చే అంశంపై మంగళవారం సమావేశం నిర్వహించనున్నట్లు ఆర్టీసీ డిపో–2 మేనేజర్ ఆర్‌సీ నిరంజన్ తెలిపారు. కార్యక్రమానికి జిల్లా ప్రజారవాణాశాఖ అధికారి హాజరవుతున్నట్లు తెలిపారు. పారిశ్రామికవేత్తలు, రవాణారంగంలో అనుభవం కలిగివారు, వ్యాపారులు సమావేశానికి హాజరు కావాలని కోరారు. పీపీపీ (ప్రైవేటు పబ్లిక్ పార్టిసిపేషన్) కింద ప్రైవేటు వ్యక్తులు లేదా సంస్థలను ఆహ్వానిస్తున్నామన్నారు. సమావేశంలో పూర్తి వివరాలు తెలియజేస్తామన్నారు.

నేడు తవ్వా వెంకటయ్యకు అభినందన సభ

కడప కల్చరల్ : వైఎస్సార్ జిల్లాకు చెందిన యువ రచయిత, సాహిత్య పరిశోధకులు డాక్టర్ తవ్వా వెంకటయ్యకు సోమవారం ఉదయం 10 గంటలకు కడప నగరంలోని సీపీ బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రంలో అభినందన సభ నిర్వహించనున్నట్లు బ్రౌన్ కేంద్రం సంచాలకులు ఆచార్య మూలమల్లికార్జునరెడ్డి తెలిపారు. డాక్టర్ వెంకటయ్యను ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం అధికారభాషా సంఘం సభ్యుడిగా నియమించిన విషయం తెలిసిందే. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని కడప నగరంలోని పలు సాహిత్య సంస్థలు కలిసి ఆయనను అభినందించేందుకు ఈ కార్యక్రమాన్ని చేపట్టనున్నారు.

15న జిల్లాలో సాగు నీటి ప్రాజెక్టుల పరిశీలన

కడప వైఎస్ఆర్ సర్కిల్: ఉమ్మడి వైఎస్సార్ జిల్లాలోని సాగు నీటి ప్రాజెక్టులను సీపీఐ ఆధ్వర్యంలో ఈ నెల 15న పరిశీలించనున్నట్లు సీపీఐ జిల్లా కార్యదర్శి చంద్ర పేర్కొన్నారు. ఆదివారం కడపలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో చాలా సాగు నీటి ప్రాజెక్టులు పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని వెంటనే పూర్తి చేయాలన్నారు. 13న తుంగభద్ర ప్రాజెక్టు, 15న రాజోలి ఆనకట్ట, బ్రహ్మసాగర్, గండికోట జలాశయం, వామికొండ రిజర్వాయర్, వెలిగల్లు ప్రాజెక్టులను పరిశీలించనున్నట్లు చెప్పారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఓబులేసు, జి. ఈశ్వరయ్య, హరినాథ్‌రెడ్డి పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు పులి కృష్ణమూర్తి, చంద్రశేఖర్, కేసీ బాదుల్లా తదితరులు పాల్గొన్నారు.

జిల్లా బాల్‌బ్యాడ్మింటన్ జట్టు ఎంపిక

ప్రొద్దుటూరు కల్చరల్: మండల పరిధిలోని దొరసానిపల్లె జెడ్పీ హైస్కూల్ మైదానంలో ఆదివారం ఉమ్మడి వైఎస్సార్ జిల్లా బాల్ బ్యాడ్మింటన్ అండర్–20 జిల్లా బ్యాడ్మింటన్ బాలబాలికల జట్ల ఎంపికలు నిర్వహించారు. బాలురు 16 మంది, బాలికలు 10 మందిని జిల్లా జట్లకు ఎంపిక చేశారు. మార్చి 5, 6, 7 తేదీల్లో నెల్లూరు జిల్లా కావలిలో జరిగే అంతర్ జిల్లాల పోటీల్లో వీరు పాల్గొననున్నారు. కార్యక్రమంలో బాల్‌బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు శంకర్‌రెడ్డి, సుధాకర్ రావు, ఎంపికల కన్వీనర్ నందకిశోర్ గౌడ్, మేరిసుప్రియ, వెంకటరమణ, సుజాత, ఏపీ స్టేట్ బాల్‌బ్యాడింటన్ మాజీ కార్యదర్శి కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల్లో 'వెన్నపూస'ను గెలిపించాలి



మాట్లాడుతున్న ప్రభుత్వ సలహాదారు చంద్రశేఖర్‌రెడ్డి

కడప రూరల్: త్వరలో జరగబోయే ఎమ్మెల్సీ ఎన్నికల్లో వెన్నపూస రవీంద్రారెడ్డిని గెలిపించాలని ప్రభుత్వ సలహాదారు (ఉద్యోగుల సంక్షేమం) ఎన్.చంద్రశేఖర్‌రెడ్డి కోరారు. ఏపీ ఎన్జీఓ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులుగా బండి శ్రీనివాసరావు, కేవీ శివారెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికైన సందర్భంగా ఆదివారం స్థానిక జిల్లా పరిషత్ కార్యాలయంలోని వైఎస్సార్ సమావేశ మందిరంలో ఆత్మీయ సన్మాన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర విభజన, కరోనా లాంటి విపత్కర పరిస్థితులు ఎదురైనా రాష్ట్ర ప్రభుత్వం పరిపాలన సజావుగా సాగేలా అన్ని చర్యలు చేపడుతోందన్నారు. దేశంలోనే ఏపీ ఎన్జీఓ అసోసియేషన్ అతి పెద్ద సంస్థ అన్నారు. ఉద్యోగుల సమస్యలు ఈ అసోసియేషన్ ద్వారానే పరిష్కారం అవుతాయన్నారు. కొన్ని ఉద్యోగ సంఘాల వారు తమ నోటికి వచ్చినట్లు మాట్లాడటం తగదన్నారు. ప్రభుత్వం అన్ని రంగాలను అభివృద్ధి చేసుకుంటూ ముందుకు వెళుతోందన్నారు. ఈ నేపథ్యంలో మనవంతుగా ప్రభుత్వానికి అండగా నిలవాలన్నారు. పరస్పర సహాయ సహకారాలు ఉండాలన్నారు. ఈ తరుణంలో జరగబోయే ఎమ్మెల్సీ ఎన్నికల్లో వెన్నపూస రవీంద్రారెడ్డిని గెలిపించాలని కోరారు. అనంతరం బండి శ్రీనివాసరావు, కేవీ శివారెడ్డిలను సత్కరించారు. పలువురు ఉద్యోగ సంఘ నేతలు పాల్గొన్నారు.

బిందు సేద్యం.. సర్కారు సాయం

బిందు సేద్యంతో వ్యవసాయ విప్లవానికి ప్రభుత్వ ప్రోత్సాహం

- 70 నుంచి 90 శాతం సబ్సిడీపై పరికరాలు
- జిల్లాలో 2022–23 ఆర్థిక సంవత్సరంలో 9,700 హెక్టార్లలో బిందు సేద్యం ఏర్పాటుకు చర్యలు
- రూ.100 కోట్ల రాయితీతో పరికరాల పంపిణీకి ప్రణాళికలు
- మార్చి నాటికి లక్ష్యం అధిగమించే దిశగా అడుగులు
- సన్న, చిన్నకారు రైతులకు అధిక ప్రాధాన్యం



వేరుశనగ పంటకు ఏర్పాటు చేసిన స్ప్రేయర్ ద్వారా నీటి తడిని అందిస్తున్న రైతు

రాయచోటి: బిందు సేద్యంతో వ్యవసాయ విప్లవానికి ప్రభుత్వం తెరతీసింది. సబ్సిడీపై బిందు సేద్యం పరికరాలు అందించి అన్నదాతకు అన్ని విధాలుగా అండగా నిలుస్తోంది.. పెట్టుబడినిధి కింద భరోసా కల్పిస్తోంది. ఆర్‌బీకేలతో క్షేత్రస్థాయిలో సాయం అందించేలా చర్యలు చేపట్టింది. సన్న, చిన్న కారు రైతులకు 90 శాతం వరకు సబ్సిడీ ఇస్తూ ప్రోత్సహిస్తోంది. తద్వారా వ్యవసాయరంగానికి ప్రభుత్వం అధికంగా సహకారం అందిస్తోంది. డ్రిప్ పరికరాలను 70 నుంచి 90 శాతం రాయితీతో రైతులకు అందజేస్తోంది. తక్కువ వ్యయంతో అధిక దిగుబడి సాధించే ప్రక్రియపై ఉద్యాన శాఖ అధికారుల ద్వారా అవగాహన కల్పిస్తోంది.

- అన్నమయ్య జిల్లాలో 9,700 హెక్టార్లలో బిందు సేద్యం చేపట్టేలా అధికారులు కసరత్తు చేస్తున్నారు. రూ.100 కోట్ల రాయితీపై పరికరాలు అందజేయాలని నిర్ణయించారు. ఇప్పటి వరకు 6433 మంది రైతులకు 6904 హెక్టార్లలో రూ.47 కోట్ల రాయితీతో మైక్రో ఇరిగేషన్ పరికరాలు అందజేశారు. మార్చి నాటికి అన్నమయ్య జిల్లాలో లక్ష్యం అధిగమించే దిశగా అడుగులు వేయనున్నారు.

అనువైన పంటలు.. ప్రయోజనాలు

మామిడి, బత్తాయి, నిమ్మ, సపోటా, అరటి, కూరగాయలు, మిరప, చెరకు, స్ప్రింక్లర్ల ద్వారా వేరుశనగ, మినుము సాగు చేయవచ్చు. బిందు స్ప్రింక్లర్ల సేద్యంతో నీటిని పొదుపు చేయవచ్చు. అలాగే విద్యుత్ ఆదా చేయవచ్చు. పురుగులు, తెగుళ్ల ఉధృతి తగ్గుతుంది. కలుపు బెడద కూడా తగ్గుతుంది. ఇలా చేయడం వలన మొక్క పెరుగుదల ఆశాజనకంగా ఉంటుంది. పంట దిగుబడి గణనీయంగా పెరుగుతుంది.

తుంపర్ల సేద్యం(స్ప్రింక్లర్లు)పై రాయితీ ఇలా..

- 5 ఎకరాలలోపు సన్న, చిన్న రైతులు స్ప్రింక్లర్ల పరికరాలను 55 శాతం రాయితీపై పొందవచ్చు.

బిందు సేద్యం పరికరాలకు రాయితీలు ఇలా..



- 5 ఎకరాలలోపు భూమి ఉన్న సన్న, చిన్నకారు రైతులకు 90 శాతం రాయితీతో డ్రిప్ పరికరాలు పొందవచ్చు. ఒక్కో రైతుకు గరిష్టంగా రూ.2.18 లక్షల వరకు రాయితీ వస్తుంది
- 5 నుంచి 10 ఎకరాల భూమి గల రైతులు 70 శాతం రాయితీతో బిందు పరికరాలు తీసుకోవచ్చు. ఒక్కో రైతు గరిష్టంగా రూ.3.46 లక్షల వరకు రాయితీ పొందవచ్చు.

- 5 నుంచి 10 ఎకరాల రైతులు 45 శాతం రాయితీపై పరికరాలు తీసుకోవచ్చు.
- రాయితీపై డ్రిప్, స్ప్రింక్లర్లు తీసుకున్న రైతులు 7 ఏళ్ల తర్వాత రెండో పర్యాయం సబ్సిడీపై పరికరాలు పొందే వెసులుబాటు కల్పించారు.

దరఖాస్తు చేసుకునే విధానం:

- డ్రిప్, స్ప్రింక్లర్ల పరికరాలను రాయితీపై పొందేందుకు ఆధార్‌కార్డు, తహసీల్దార్ ధ్రువీకరించిన భూమి యాజమాన్య పత్రం లేదా 1బీ రికార్డుతో రైతు భరోసా(ఆర్‌బీకే) కేంద్రంలో బయోమెట్రిక్ ద్వారా నేరుగా దరఖాస్తు చేసుకోవాలి.
- జిల్లాకు చెందిన రైతులు చెల్లించాల్సిన నాన్ సబ్సిడీ మొత్తాన్ని ప్రాజెక్టు డైరెక్టర్, జిల్లా, మైక్రో ఇరిగేషన్ అధికారి, అన్నమయ్య జిల్లా పేరు మీద అకౌంట్ నంబరు 9220100232805750, యాక్సిస్ బ్యాంకుకు నేరుగా లేదా గూగుల్, ఫోన్ పే ద్వారా చెల్లించవచ్చు.

ప్రభుత్వానికి ధన్యవాదాలు



2022–23 సంవత్సరంలో రైతు భరోసా కేంద్రం ద్వారా 3 ఎకరాల మామిడి తోట కు డ్రిప్‌కు దరఖాస్తు చేసుకున్నాను. 90 శాతంతో నా వాటాగా నేను రూ.22,385 చెల్లించాను. రూ.63,942 పరికరాలు మంజూరు చేశారు. గతంలో మొత్తం విస్తీర్ణం సాగు చేయడానికి చాలా కష్టంగా ఉండేది. ప్రభుత్వ రాయితీపై డ్రిప్ పరికరాలు పొందిన తరువాత ఉన్న నీటితో 3 ఎకరాలకు సాగు చేస్తున్నా. ఈ ప్రభుత్వం చేసిన సహాయానికి ధన్యవాదాలు. –ఎస్.శ్రీనివాసులురెడ్డి, రైతు,కేవీపల్లి మండలం, అన్నమయ్య జిల్లా

లాభసాటి వ్యవసాయం చేసుకుంటున్నాం



నాకు గల 3 ఎకరాల పొలంలో అన్ని రకాల కూరగాయల పంటలు, పూలతోటలు సాగు చేసుకుంటున్నా. సాగు ఖర్చులు, కూలీల అవసరం ఎక్కువగా ఉండేది. ప్రభుత్వం వచ్చిన తర్వాత మా ముంగిటే రైతు భరోసా కేంద్రం ఏర్పాటు చేసింది. ఆర్‌బీకేలో డ్రిప్ కోసం దరఖాస్తు చేసుకున్నాను. 90 శాతం రాయితీతో నా వాటా రూ.23,798 చెల్లించగా, ప్రభుత్వం రూ.1,18,186 ఖర్చు భరించి డ్రిప్ పరికరాలను అందజేసి పొలంలో అమర్చారు. – టి.వెంకటరమణారెడ్డి, రైతు, కేవీపల్లె గ్రామం, సొరకాయలపేట, అన్నమయ్య జిల్లా

రైతు సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం



2022–23 ఆర్థిక సంవత్సరానికి జిల్లాలో 9700 హెక్టార్లలో డ్రిప్, స్ప్రింక్లర్ ఇరిగేషన్ అమలు లక్ష్యం కాగా ఇప్పటి వరకు ఆర్బీకేల ద్వారా నమోదు చేసుకున్న 6433 మంది రైతులకు 6904 హెక్టార్లలో రూ.47 కోట్ల రాయితీతో డ్రిప్, స్ప్రింక్లర్ పరికరాలు సరఫరా చేశాం. రాష్ట్ర ప్రభుత్వం పెద్ద ఎత్తున డ్రిప్ పరికరాలపై రాయితీ ఇచ్చి రైతులను ప్రోత్సహిస్తోంది. నీటివసతి కలిగిన రైతులందరూ రాయితీ ద్వారా పొందిన మైక్రో ఇరిగేషన్ పరికరాలను సద్వినియోగం చేసుకోవాలి. –వెంకటేశ్వరరెడ్డి, సూక్ష్మ నీటి సేద్య అధికారి, అన్నమయ్య జిల్లా

అర్హులందరికీ సబ్సిడీపై పరికరాలు



అన్నమయ్య జిల్లాలో అర్హులైన రైతులందరికీ సబ్సిడీపై పరికరాలు అందిస్తున్నాం. కాలువలు, బోర్ల ద్వారా పారగట్టే పద్ధతికి రైతులు స్వస్తి పలికి, ఎక్కువగా బిందు, తుంపర సేద్యం వైపు అడుగులు వేయాలి. రైతులకు రాష్ట్ర ప్రభుత్వం కూడా తోడ్పాటును అందిస్తోంది. స్ప్రింక్లర్లు, డ్రిప్‌లను వినియోగించుకునే రైతులకు ప్రత్యేకంగా రాష్ట్ర ప్రభుత్వం పెద్ద ఎత్తున రాయితీలను అందించి ప్రోత్సాహం అందిస్తోంది. – గిరీషా పీఎస్, అన్నమయ్య జిల్లా కలెక్టర్

హార్సిలీహిల్స్‌పై నేడు టూరిస్ట్ పోలీసు ప్రారంభం



హార్సిలీహిల్స్‌పై టూరిస్ట్ పోలీసు కేంద్రంలో ఏర్పాట్లు పరిశీలిస్తున్న ఎస్పీ హర్షవర్ధన్‌రాజు

- వర్చువల్ పద్ధతిలో ప్రారంభించనున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి
- ట్రయల్ రన్‌లో పాల్గొన్న ఎస్పీ

బి.కొత్తకోట: ఆంధ్రాఊటీగా పేరుగాంచిన బి.కొత్తకోట మండలం హార్సిలీహిల్స్‌పై సోమవారం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేతుల మీదుగా జరిగే టూరిస్ట్ పోలీసు (పోలీసు ఔట్‌పోస్టు) కేంద్రం ప్రారంభోత్సవ ఏర్పాట్లను ఆదివారం జిల్లా ఎస్పీ వి.హర్షవర్ధన్‌రాజు పరిశీలించారు. రాష్ట్ర వ్యాప్తంగా పర్యాటక ప్రాంతాల్లో సందర్శకులకు భద్రత కల్పించడం కోసం ప్రభుత్వం టూరిస్ట్ పోలీసు విధానం అమలులోకి తీసుకొచ్చింది. ప్రత్యేక పోలీసులను నియమించి శాంతిభద్రతలను పర్యవేక్షించడం, సందర్శకులకు అవసరమైన సమాచారం ఇవ్వడం, వారి ఇబ్బందులను తెలుసుకొని పరిష్కరించడానికి ప్రభుత్వం నిర్ణయించింది. టూరిస్ట్ పోలీసు కేంద్రంలో డీఎస్పీ శ్రీనివాసరావు, సీఐ శివాంజనేయులు, ఎస్‌ఐలు రామమోహన్, సుకుమార్‌లతో ఎస్పీ హర్షవర్ధన్‌రాజు ఏర్పాట్లను సమీక్షించారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వర్చువల్ పద్ధతిలో టూరిస్ట్ పోలీసు కేంద్రాన్ని సోమవారం ప్రారంభిస్తారు. దీనికోసం ముందస్తు ప్రారంభోత్సవ ఏర్పాట్లలో భాగంగా విజయవాడ పోలీసు ప్రధాన కేంద్రం నుంచి అడిషనల్ డీజీ రవిశంకర్ నిర్వహించిన ట్రయల్‌రన్‌లో ఎస్పీ హర్షవర్ధన్‌రాజు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి సాఫ్ట్ టెన్నిస్ చాంపియన్‌గా కృష్ణాజట్టు

కడప ఎడ్యుకేషన్: కడప నగరంలోని డీఎస్‌ఏ మైదానంలో శని, ఆదివారాల్లో నిర్వహించిన రాష్ట్రస్థాయి సాఫ్ట్ టెన్నిస్ పోటీల ముగింపు కార్యక్రమం ఆదివారం జరిగింది. ఈ కార్యక్రమానికి జిల్లా డీఎస్‌ఏ చీఫ్ కోచ్ అమృతరాజు ముఖ్య అతిథిగా విచ్చేసి విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ పోటీల్లో కృష్ణాజట్టు చాంపియన్‌గా నిలిచింది. టీం ఈవెంట్ మహిళల విభాగంలో కృష్ణాజట్టు ప్రథమ, గుంటూరు జట్టు ద్వితీయ,కడప జట్టు తృతీయ స్థానాలు సాధించాయి. పురుషుల టీం ఈవెంట్ విభాగంలో కృష్ణా, అనంతపురం , కడప జట్లు వరుసగా ప్రథమ,ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించాయి. మహిళల సింగిల్స్ విభాగంలో కృష్ణా జిల్లాకు చెందిన లావణ్య ప్రథమ, అనంతపురం జిల్లాకు చెందిన యశస్వి ద్వితీయ, కృష్ణాజిల్లా అనూష తృతీయ స్థానాలు సాధించారు. పురుషుల సింగిల్స్ విభాగంలో వహీద్, సూర్య ఆకాష్ ప్రణయ్‌లు రాణించారు.



మహిళల విభాగంలో ప్రథమస్థానంలో నిలిచిన కృష్ణాజట్టు

గాల్లో తేలినట్టుందే!



మదనపల్లె: తట్టివారిపల్లె బైపాస్‌రోడ్డులో ముందుకు లేచిన ఐషర్ లారీ

సాధారణంగా ఎవరైనా అధికబరువును మోస్తుంటే గాడిద బరువు మోస్తున్నాడనడం పరిపాటి. మోసేదానికన్నా అధిక బరువు వేస్తే జంతువే కాదు... యంత్రం సైతం మొరాయిస్తుందనేందుకు ఇదిగో ఇదే ఉదాహరణ. ఆదివారం మధ్యాహ్నం ఇనుపరేకులను వేసుకుని వెళుతున్న ఐషర్ లారీ అధిక బరువు కారణంగా తట్టివారిపల్లె బైపాస్‌రోడ్డు జంక్షన్‌లో ఉన్నపళంగా ముందు టైర్లు లేచిపోవడంతో ముందుభాగం గాల్లో తేలుతూ కనిపించింది. దీన్ని అటుగా వెళుతున్న కొందరు తమ సెల్‌ఫోన్‌లలో ఫొటోలు తీసి వాట్సప్, ఫేస్‌బుక్‌లలో షేర్‌చేయడంతో ఎవరికి వారు తమకు తోచిన విధంగా కామెంట్లు, షేర్ చేసుకున్నారు. తర్వాత డ్రైవర్ టౌన్‌లోకి వెళ్లి మెకానిక్‌లను తీసుకువచ్చి వాహనాన్ని గాల్లో నుంచి కిందకు దింపి తిరిగి రోడ్డుబాట పట్టించాడు. – మదనపల్లె

టచ్ చేయొద్దు.. సంస్కారమే హద్దు..!

మాటిమాటికి తడుముతుంటే.. ముద్దు చేస్తున్నారేమో అనుకుంటారు.. అది రాక్షస స్పర్శ అని తెలియని పసితనం పాపం.. ఏవేవో మాటలు చెబుతూ ఒంటిమీద చేతులేస్తే.. అది ప్రేమని సరిపెట్టుకుంటారు వాళ్లు.. అది కాటేసే కర్కశత్వమని ఆలోచించని అమాయకత్వం వారిది. ఆ పసిపిల్లలకు లైంగిక విద్యపై అవగాహన కల్పిస్తున్నారు విద్యా, పోలీసు, ఐసీడీఎస్ శాఖల అధికారులు.

మంచి, చెడు స్పర్శలపై పిల్లలను అప్రమత్తం చేస్తూ అవగాహన కార్యక్రమాలు



కాలేజీలో విద్యార్థినులకు డ్రగ్స్ వల్ల కలిగే అనర్థాలను వివరిస్తున్న పోలీసు అధికారులు(ఫైల్)



మదనపల్లె సిటీ: బాలికలు, యువతులు, మహిళలు గడపదాటితే అనేక సవాళ్లు. విద్యాలయం నుంచి కార్యక్షేత్రం వరకు ఇంటా బయటా ఎదురయ్యే అనర్థాల పట్ల జాగృత పరచడం, వాటిని అధిగమించే స్థైర్యాన్ని నింపేందుకు జిల్లాలోని అధికారులు పలు కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. ప్రభుత్వ పాఠశాలలు, కాలేజీలు, వసతి గృహాల్లో ఆడపిల్లలకు ఎదురయ్యే మంచి, చెడు స్పర్శల గురించి అవగాహన కల్పిస్తూ వాటిని ఎలా ఎదుర్కోవాలో వివరిస్తున్నారు. సవాళ్లను ఎదుర్కోవడంపై విద్యా, పోలీసు, ఐసీడీఎస్ శాఖల ద్వారా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తూ అప్రమత్తం చేస్తున్నారు.

మంచి..చెడు స్పర్శ గురించి..

బాలికలు ఏ తరగతి వారైనా..ఎదుటి వ్యక్తితో మాట్లాడేటప్పుడు కనీస దూరం పాటించాలి. మంచి, చెడు స్పర్శకు తావీయకూడదు. విద్యాలయాల్లో, ఇతర ప్రదేశాల్లో బాలికలు, యువతుల పట్ల సంస్కారంగా ఉండాలని దిశానిర్దేశం చేస్తున్నారు. ప్రతి ఒక్కరి చేతిలో సెల్‌ఫోన్ సాధారణమైపోయింది. అవగాహన లేక యువత, విద్యార్థులు అందులో కనిపించే అనేక గేమ్స్ ఆడుతున్నారు. ఈ క్రమంలో సైబర్ కేటుగాళ్ల బారిన పడి మోసపోతున్నారు. వీటిపై అవగాహన కల్పిస్తున్నారు.

మహిళా రక్షణ..

విద్యాలయాలు, కార్యాలయాలు, వ్యాపారసంస్థలు, కూడళ్లు, రవాణా సాధనాల్లో బాలికలు, అతివలకు కలిగే అసౌకర్యాన్ని ఎదురయ్యే ఇబ్బందులను పోలీసులు వివరిస్తున్నారు. పాఠశాలలు, కళాశాలలు వేదికగా దిశ–మహిళా రక్షణపై చైతన్య పరుస్తున్నారు. సవాళ్ల బారిన పడకుండా, ఒక వేళ ఎదురైతే ఏ విధంగా స్పందించాలనే తీరును వివరిస్తున్నారు. ప్రభుత్వం కల్పించే భద్రతా చర్యలను ఎలా వినియోగించుకోవాలో తెలియజేస్తున్నారు.


మాదక ద్రవ్యాలు..

పొగాకు ఉత్పత్తులు, మద్యం ప్రభావం పెరుగుతోంది. కుర్రాళ్లే వీటి వినియోగంలో ముందుంటున్నారని అధ్యయనాలు చెబుతున్నాయి. వ్యసనాల బారిన పడకుండా అప్రమత్తం చేస్తున్నారు. డ్రగ్స్ వల్ల కలిగే అనర్థాల గురించి విద్యాలయాల వద్ద పోలీసుశాఖ పెద్ద హోర్డింగ్‌లు ఏర్పాటు చేసింది. వీటి వల్ల కలిగే అనర్థాలను విద్యార్థులకు వివరిస్తున్నారు.

రహదారి భద్రతపై కూడా..

ఎన్ని చర్యలు తీసుకుంటున్నా రహదారి భద్రత ఆందోళనకరంగానే ఉంటోంది. ప్రధాన రోడ్లపై రయ్‌మంటూ స్పోర్ట్స్ బైక్‌లతో దూసుకుపోతున్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలకు వాహనాలు కొనివ్వడం స్టేటస్‌గా భావిస్తుండగా .. అతి వేగంతో వాహనాలు నడిపి యువత ప్రమాదాల బారిన పడుతున్నారు. వేగం కారణంగా జరిగే ప్రమాదాలే అధికంగా ఉంటున్నాయని పోలీసులు చెబుతున్నారు. దీనిపై విద్యాలయాల్లో పోలీసులు అవగాహన కల్పిస్తున్నారు.

అవగాహన కల్పిస్తున్నాం



విద్యార్థినులు ఎదుర్కొనే సమస్యలను ఎలా పరిష్కరించుకోవాలన్న దానిపై కాలేజీలు, పాఠశాలల్లో అవగాహన కల్పిస్తున్నాం. డ్రగ్స్ వాడకం వల్ల కలిగే అనర్థాలు వివరిస్తున్నాం. బైక్‌లు నడిపేటప్పుడు ప్రమాదాలు జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు తెలియజేస్తున్నాం. –కేశప్ప, డీఎస్పీ, మదనపల్లె

సహవాసాలపై దృష్టి



పిల్లల దినచర్య, వ్యవహారశైలిని తల్లిదండ్రులు గమనించాలి. పరిసరాలు, సహవాసాలపై దృష్టి పెట్టాలి. తల్లిదండ్రులిద్దరూ ఏ ఉద్యోగ ఉపాధి వ్యాపకాల్లో ఉన్నా పిల్లలను సంస్కారవంతులుగా పెంచడమే ప్రధాన బాధ్యతగా ఉండాలి. –లలితమ్మ, ఫోర్డు డైరెక్టర్, మదనపల్లె

నైతిక విలువలు పాటించాలి



ఆడపిల్లలకు మంచి, చెడు స్పర్శ గుర్తించేలా సున్నితంగా వివరిస్తున్నాం. విద్యార్థుల్లో నైతిక విలువలు పెంపొందించే ప్రయత్నం పాఠశాలల్లో చేస్తాం. –పద్మావతి, హెచ్‌ఎం, ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల, మదనపల్లె

క్లుప్తంగా

పాము కాటుతో రైతుకు అస్వస్థత

మదనపల్లె : వ్యవసాయ పొలంలో రైతు పాము కాటుకు గురై తీవ్ర అస్వస్థత పాలయ్యాడు. మదనపల్లె మండలం పోతబోలు పంచాయతీ ఉప్పరపల్లెకు చెందిన రైతు రాజ్‌కుమార్(30) బోరు వద్ద వ్యవసాయ పొలానికి నీరు పెట్టేందుకు వెళ్లాడు. పంపుసెట్ మోటార్ ఆన్ చేసేందుకు వెళ్లగా అక్కడే ఉన్న విషసర్పం కాటేసింది. దీంతో రాజ్‌కుమార్ తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. గమనించిన కుటుంబ సభ్యులు బాధితుడిని మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు.

విద్యుదాఘాతంతో గుడిసె దగ్ధం



మంటలను ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

ఓబులవారిపల్లె : మండల పరిధిలోని చిన్నంపల్లి ఎస్టీ కాలనీలో డక్కిలి వసుమతికి చెందిన పూరిగుడిసె విద్యుదాఘాతంతో దగ్ధమైంది. సాయంత్రం ఇంటిలో విద్యుత్ తీగల వద్ద మంటలు చెలరేగడంతో గుడిసెకు నిప్పంటుకుంది. గమనించిన వసుమతి, భర్త మణి, పిల్లలు భయాందోళనకు గురై బయటకు వచ్చారు. క్షణాల్లో పూరిగుడిసె పూర్తిగా కాలిపోయింది. గుడిసెలోని బియ్యం, నిత్యావసర వస్తువులు, రూ. 20 వేల నగదు, దుస్తులు కాలిబూడిదయ్యాయి. సంఘటన స్థలానికి అగ్నిమాపక సిబ్బంది చేరుకొని మంటలను ఆర్పివేశారు. వీఆర్‌ఓ అంబటి శ్రీను వచ్చి పరిశీలించారు. దాదాపు రూ.1 లక్ష నష్టం వాటిల్లిందని బాధితులు వాపోయారు.

హత్యరాల.. బ్రహ్మోత్సవాల వేళ



పూజలందుకుంటున్న త్రేతేశ్వరస్వామి



ప్రత్యేక అలంకరణలో శ్రీకామాక్షీదేవి



శ్రీకామాక్షి సమేత త్రేతేశ్వరస్వామి ఆలయ ముఖద్వారం

- రేపటి నుంచి త్రేతేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు
- 9 రోజుల పాటు వైభవంగా నిర్వహణ
- 18న శివరాత్రి, 19న కల్యాణం, 20న రథోత్సవం
- భారీగా తరలిరానున్న భక్తులు

రాజంపేట రూరల్ : ఉమ్మడి వైఎస్సార్ జిల్లాలోని ప్రముఖ శైవ క్షేత్రాలలో ఒకటైన హత్యరాలలో ఏటా వైభవంగా నిర్వహించే బ్రహ్మోత్సవాలు వచ్చేశాయి. శ్రీకామాక్షి సమేత త్రేతేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు మంగళవారం ఘనంగా ప్రారంభం కానున్నాయి. ఈ నెల 14 నుంచి 22 వరకు కొనసాగుతాయి. శివరాత్రి సందర్భంగా 17, 18, 19 తేదీల్లో ప్రధాన ఉత్సవాలు నిర్వహించనున్నారు. 18న వేల సంఖ్యలో భక్తులు దర్శించుకోనున్నారు. జాగారణ రోజు స్వామి వారి హరికథా కాలక్షేపానికి అధిక ప్రాధాన్యత ఇస్తారు. మూడు రోజుల పాటు దాతలు, సంఘ సేవకులు, స్వచ్ఛంద సంస్థల నిర్వాహకులు భక్తులకు ఉచితంగా అన్నదానాలు, మజ్జిగ, మంచినీటి సరఫరా వంటి కార్యక్రమాలు చేపట్టనున్నారు.

18న లింగోద్భవం

18న (శనివారం) శివరాత్రిని పురస్కరించుకొని వేకువజాము నుంచే స్వామి వారి దర్శన సౌకర్యం కల్పించనున్నారు. కామాక్షిమాత, త్రేతేశ్వరస్వామిని ప్రత్యేకంగా అలంకరిస్తారు. ఉదయం 9 గంటలకు కపాలేశ్వర ఉత్సవం, రాత్రి 7కు శిఖరదీపారాధన, రాత్రి 9కి లింగార్చన, 12కు లింగోద్భవం, ఒంటి గంటకు నంది ఉత్సవం నిర్వహించనున్నారు.

19న కల్యాణం

శ్రీకామాక్షి సమేత త్రేతేశ్వరస్వామి కల్యాణాన్ని 19న (ఆదివారం) ఉదయం 9.20 నుంచి 10.30 గంటల వరకు వైభవంగా నిర్వహించనున్నారు. రాత్రి 9కి అశ్వవాహనం, 10కి గజవాహనంపై స్వామి, అమ్మవారి గ్రామోత్సవం నిర్వహిస్తారు.

20న రథోత్సవం

20న (సోమవారం) ఉదయం 10 గంటలకు రథోత్సవాన్ని వైభవంగా నిర్వహించనున్నారు. రాత్రి 8 గంటలకు హనుమంత వాహనంపై స్వామి వారి ఊరేగింపు ఉంటుంది. మధ్యాహ్నం 2.30 గంటలకు జిల్లా స్థాయి బండలాగుడు పోటీలు నిర్వహించనున్నారు. ప్రథమ బహుమతిగా రూ.50 వేలు, ద్వితీయ బహుమతిగా రూ.40 వేలు, తృతీయ బహుమతిగా రూ.30 వేలు, చతుర్థ బహుమతిగా రూ.20 వేలు, పంచమ బహుమతిగా రూ.10 వేలు అందించనున్నారు. పోటీలలో పాల్గొనే వారు దేవస్థాన చైర్మన్ వీవీ సుబ్బారెడ్డి ఫోన్ నంబర్: 8790977712ను సంప్రదించాలి.

ప్రత్యేక ఏర్పాట్లు

17, 18, 19వ తేదీల్లో ఆర్టీసీ సంస్థ డీఎం సీ రమణయ్య ఆధ్వర్యంలో రాజంపేటలోని వైఎస్సార్ సర్కిల్ పాతబస్టాండు, చిట్వేలి నుంచి హత్యరాలకు ప్రత్యేక బస్సు సర్వీసులు ఏర్పాటు చేస్తోంది. తహసీల్దార్ ముద్దా సుబ్రమణ్యంరెడ్డి, మున్సిపల్ కమిషనర్ ఎం.జనార్దనరెడ్డి, ఈఓ జీ కొండారెడ్డి, దేవస్థాన కమిటీ చైర్మన్ వెలగచెర్ల వెంకటసుబ్బారెడ్డి, రూరల్ ఎస్‌ఐ భక్తవత్సలంతో సబ్‌కలెక్టర్ అహ్మద్‌ఖాన్ సమావేశమై ప్రజలు, భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా బ్రహ్మోత్సవాలు నిర్వహించే విధంగా ఏర్పాట్లు చేస్తున్నారు. డీఎస్పీ జీ శివభాస్కర్‌రెడ్డి పర్యవేక్షణలో రూరల్ సీఐ పుల్లయ్య ఆధ్వర్యంలో శాంతిభద్రతలపై చర్యలు చేపడుతున్నారు. విద్యుత్‌శాఖ డీఈ ఆర్.చంద్రశేఖర్‌రెడ్డి, డీఈఈ సురేంద్రనాథ్ ఆధ్వర్యంలో విద్యుత్ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. బహుదానది తీరం వెంట బారీ కేడ్లను ఏర్పాటు చేయనున్నారు. భక్తుల కోసం స్నాన ఘట్టాలను ప్రత్యేకంగా ఏర్పాటు చేస్తున్నారు.

గుండ్లూరు, ఊటుకూరులో..

మండల పరిధిలోని గుండ్లూరులో బహుదానది తీరాన వెలసిన శ్రీ కామాక్షి సమేత శ్రీఅగస్త్యేశ్వర స్వామి ఆలయంలో శివరాత్రి బ్రహ్మోత్సవాలు వైభవంగా నిర్వహించనున్నారు. అన్నమాచార్య పూజలు చేసిన ఊటుకూరులోని శ్రీకామాక్షి సమేత శ్రీనాగలింగేశ్వరస్వామి ఆలయంలో ఘనంగా వేడుకలు నిర్వహించనున్నారు. ఈ ఆలయాలలో 18న ఆది దంపతుల కల్యాణ వేడుకలు నిర్వహిస్తారు.

అన్ని శాఖల సమన్వయంతో..



అన్ని శాఖల అధికారుల సమన్వయంతో హత్యరాలలో శివరాత్రి మహోత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం. 9 రోజుల పాటు స్వామి వారి ఉత్సవాలు వైభవంగా నిర్వహిస్తాం. ఇప్పటికే అన్ని శాఖల అధికారులు తమ పరిధిలోని వ్యవహారాలను చక్కదిద్దటంలో నిమగ్నమయ్యారు.

– జీ కొండారెడ్డి, దేవదాయశాఖ ఈఓ, రాజంపేట

భక్తులకు సౌకర్యాలు కల్పిస్తున్నాం



శివరాత్రి మహోత్సవాలకు వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగనివ్వకుండా అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నాం. ప్రతి భక్తుడు స్వామి వారిని దర్శనం చేసుకొనేలా ఏర్పాట్లు చేస్తున్నాం. ఉత్సవాలలో పాల్గొని స్వామి, అమ్మవారి కృపకు పాత్రులు కావాలని భక్తులకు మనవి చేసుకుంటున్నాం.

– వెలగచెర్ల వెంకటసుబ్బారెడ్డి, దేవస్థాన కమిటీ చైర్మన్, శ్రీకామక్షి సమేత త్రేతేశ్వరస్వామి ఆలయం

మురుగునీటి విషయమై ఘర్షణ

ముగ్గురికి గాయాలు



గాయపడిన చెన్నమ్మ

మదనపల్లె : ఇంటి ముందు పారే మురుగునీటి విషయమై ఆదివారం సాయంత్రం జరిగిన ఘర్షణలో ముగ్గురికి గాయాలయ్యాయి. బాధితులు తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. మదనపల్లె మండలం సీటీఎం గ్రామం ఎగువ దళితవాడ గొల్లపల్లెమిట్టకు చెందిన ఈశ్వరయ్య భార్య చెన్నమ్మ(55), ఆమె మరిది కుమారుడు నరసింహులు(24), అతని భార్య మేఘమాల(21) తమ ఇంటి వద్దకు మురుగునీరు ఎగువ ఇంటి నుంచి వస్తుండటంతో.. అంజి, రాజు, చలపతి, ఎల్లమ్మ, గంగలను నిలదీశారు. తమకు ఇబ్బందిగా ఉందని, మురుగునీరు రాకుండా చేయాలని అడిగారు. దీంతో వివాదం ఏర్పడింది. ఇరువర్గాల మధ్య ఘర్షణ చోటుచేసుకుంది. గొడవలో అంజి, చలపతి, రాజు, ఎల్లక్క, గంగ తదితరులు మరో 20 మందితో కలిసి చెన్నమ్మ వర్గంపై దాడి చేశారు. చెన్నమ్మను బండరాయితో కొట్టడంతో ఆమె వెన్నుపూస దెబ్బతింది. ఆమెతోపాటు నరసింహులు, మేఘమాల గాయపడ్డారు. బాధితులను స్థానికులు 108 వాహనంలో మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. మదనపల్లె తాలూకా పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మహిళపై దాడి : కేసు నమోదు

కలకడ : మండలంలోని కదిరాయచెర్వు గ్రామంలో ఆదివారం మహిళను దుర్భాష లాడి దాడి చేశారు. ఎస్‌ఐ తిప్పే స్వామి తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. కదిరాయచెర్వు గ్రామంలోని గంట శ్రీనివాసులు భార్య ప్రమీలను అదే గ్రామానికి చెందిన శ్రీరాములు, అతని కుటుంబ సభ్యులు కలిసి కోళ్లు పోయినందుకు దుర్భాషలాడి దాడి చేశారు. బాధితురాలు ప్రమీల ఇచ్చిన ఫిర్యాదు మేరకు శ్రీరాములు, వారి కుటుంబ సభ్యులపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

వేర్వేరు ప్రమాదాల్లో ఆరుగురికి గాయాలు

మదనపల్లె : వేర్వేరు ప్రాంతాల్లో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదాల్లో ఆరుగురు గాయపడ్డారు. మదనపల్లెలోని బుగ్గకాలువకు చెందిన సంతోష్(24), కొత్తపల్లెకు చెందిన రాజు(23) కలిసి బైక్‌పై చిత్తూరు బస్టాండ్ సర్కిల్‌కు వస్తుండగా.. టౌన్‌హాల్ వద్ద వీధిలో నుంచి రోడ్డుపైకి ఓ స్కూటీ వస్తోంది. ఈ రెండు వాహనాలు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో రాజు తీవ్రంగా, సంతోష్ స్వల్పంగా గాయపడ్డారు. బాధితులు చికిత్స కోసం ప్రైవేట్ ఆస్పత్రికి వెళ్లారు. వన్‌టౌన్ పోలీసులు వాహనాలు స్వాధీనం చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. అదే విధంగా పట్టణంలోని నిమ్మనపల్లె సర్కిల్ పెట్రోల్‌బంక్ వద్ద కలిచెర్ల వడ్డిపల్లెకు చెందిన రెడ్డెప్ప మద్యం మత్తులో ఉండగా, స్కార్పియో వాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో రెడ్డెప్ప తీవ్రంగా గాయపడగా.. అదే వాహనంలో బాధితున్ని ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు.

ఢీకొన్న బైక్‌లు

సంబేపల్లె : చిత్తూరు–కర్నూలు జాతీయ రహదారిపై ఆదివారం రెండు బైక్‌లు ఢీకొనడంతో ఇద్దరికి గాయాలయ్యాయి. రెడ్డివారిపల్లె పంచాయతీ గొనపల్లెకు చెందిన మల్లికార్జున రాయచోటి వైపు నుంచి దేవపట్లకు ద్విచక్ర వాహనంలో వస్తుండగా.. లక్కిరెడ్డిపల్లెకు చెందిన గంగాధర్ బైక్‌పై కలకడ వైపు నుంచి రాయచోటికి వెళుతున్నారు. ఈ రెండు వాహనాలు దేవపట్ల ఆవులవాండ్లపల్లె క్రాస్ రోడ్డు సమీపంలో ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో మల్లికార్జున, గంగాధర్ తీవ్రంగా గాయపడ్డారు. వారిని 108 సాయంతో రాయచోటి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేస్తునట్లు ఎస్‌ఐ షరీఫ్ తెలిపారు.

నడుచుకుంటూ వస్తుండగా..

సంబేపల్లె మండల పరిధిలోని చిత్తూరు రోడ్డు–గుడిబండకు వెళ్లే మార్గంమధ్యలో ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలయ్యాయి. మండల పరిధిలోని నల్లగుట్టపల్లెకు చెందిన పి.శ్రీరాములు సొంత పనుల నిమిత్తం గుట్టపల్లెకు వెళ్లి తిరిగి నడుచుకుంటూ వస్తున్నాడు. ఈ క్రమంలో గుడిబండకు చెందిన నరసింహులు తన ద్విచక్ర వాహనంలో గుట్టపల్లెకు వెళుతుండగా ఎగువగుట్టపల్లె క్రాస్ వద్దకు రాగానే ఎదురుగా వస్తున్న శ్రీరాములను ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో శ్రీరాములుతోపాటు నరసింహులుకు గాయాలయ్యాయి. వారిని స్థానికులు ఆసుపత్రికి తరలించారు.



గాయపడ్డ మల్లికార్జున

ఎగువ భద్ర ప్రాజెక్ట్ నిర్మాణాన్ని అడ్డుకోవాలి

ఎమ్మెల్యేకు రాయలసీమ స్టీరింగ్ కమిటీ వినతి



ఎమ్మెల్యే నవాజ్‌బాషాకు వినతిపత్రం అందిస్తున్న రాయలసీమ స్టీరింగ్ కమిటీ సభ్యులు

మదనపల్లె : కర్ణాటకలో నిర్మించేందుకు ప్రయత్నిస్తున్న ఎగువభద్ర ప్రాజెక్ట్‌తో రాయలసీమకు కేటాయించిన నికరజలాలు కనుమరుగయ్యే ప్రమాదం ఉన్నందున, సీమలోని ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఇతర ప్రజాప్రతినిధులు రాజకీయాలకు అతీతంగా కలిసి అడ్డుకోవాలని రాయలసీమ స్టీరింగ్ కమిటీ సభ్యులు విన్నవించారు. ఆదివారం ఎమ్మెల్యే నవాజ్‌బాషాను వారు కలిసి ముఖ్యమంత్రితో త్వరలో జరగనున్న సమీక్షా సమావేశంలో ఎగువభద్ర విషయమై ప్రస్తావించాల్సిందిగా కోరారు. ఈ సందర్భంగా స్టీరింగ్ కమిటీ సభ్యులు మాట్లాడుతూ ఎగువ భద్ర పూర్తయితే తుంగభద్ర డ్యామ్, కేసీ కెనాల్, ఆర్డీఎస్, శ్రీశైలం, నాగార్జున సాగర్‌తోపాటు కృష్ణాడెల్టాలో తాగు, సాగునీటికి తీవ్ర ఇబ్బందులు నెలకొంటాయన్నారు. దీనిని అడ్డుకోకుంటే రాయలసీమ ఎడారిగా మారే ప్రమాదం ఉందన్నారు. అలాగే నంద్యాల జిల్లా కొత్తపల్లె మండలం సిద్ధేశ్వరం వద్ద కృష్ణానదిపై కేంద్ర ప్రభుత్వం నిర్మిస్తున్న ఐకానిక్ (తీగల) వంతెన బదులుగా బ్యారేజ్ కం బ్రిడ్జి నిర్మాణాన్ని చేపట్టాలని డిమాండ్ చేశారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల మధ్య కృష్ణానదిపై సిద్ధేశ్వరం వద్ద రూ.1,200 కోట్లతో ఐకానిక్ బ్రిడ్జిని కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. అయితే తీగల బ్రిడ్జి వల్ల రాయలసీమకు ఎలాంటి ఉపయోగం ఉండదని, దానికి బదులుగా బ్యారేజీ కం బ్రిడ్జి నిర్మిస్తే 70 టీఎంసీల నీరునిలిచి అటు తెలంగాణలోని నాగర్‌కర్నూలు, గద్వాల్ జిల్లాలు, ఇటు రాయలసీమ ఎనిమిది జిల్లాలు, నెల్లూరు జిల్లాలకు సాగు,తాగు నీరు అందే అవకాశం ఉందన్నారు. అంతేకాకుండా శ్రీశైలం ప్రాజెక్టుకు ఎగువభాగం నుంచి వచ్చే నీటి ప్రవాహ ఒత్తిడి తగ్గిస్తుందని, పూడిక నివారిస్తుందని, రక్షణగా ఉంటుందన్నారు. ఈ రెండు ప్రధాన సమస్యలను సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, కేంద్ర జాతీయ రహదారుల మంత్రి నితిన్‌గడ్కరీ, కేంద్ర జలశక్తి మంత్రి గజేంద్రషెకావత్ దృష్టికి తీసుకెళ్లి రాయలసీమలో కరువు, వలసలకు శాశ్వత పరిష్కారం చూపే దిశగా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో రాయలసీమ స్టీరింగ్ కమిటీ జిల్లా యూత్ ప్రెసిడెంట్ బత్తుల రెడ్డిప్రసాద్, రాయలసీమ విద్యార్థి సమాఖ్య అధ్యక్షుడు వలిపి ఉత్తన్న పాల్గొన్నారు.

ఉరి వేసుకుని వ్యక్తి ఆత్మహత్య

మదనపల్లె : మండలంలోని చిన్నతిప్పసముద్రంలో ఓ వ్యక్తి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. చిన్నతిప్పసముద్రం (సీటీఎం) గ్రామానికి చెందిన హరి(32) ద్విచక్రవాహన మెకానిక్‌గా పని చేస్తుండే వాడు. కుటుంబ సమస్యల కారణంగా మనస్తాపం చెంది శనివారం రాత్రి ఇంట్లో నుంచి వెళ్లిపోయి గ్రామ సమీపంలో ఉన్న చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం తెలుసుకున్న కుటుంబ సభ్యులు స్థానికుల సాయంతో మృతదేహాన్ని కిందకు దించారు. ఆదివారం ఉదయం అంత్యక్రియలు నిర్వహించారు. ఘటనపై మదనపల్లె తాలూకా పోలీసులను విచారణ చేయగా.. తమకు ఆత్మహత్యకు సంబంధించి ఎలాంటి ఫిర్యాదు అందలేదని తెలిపారు.

చౌక బియ్యం పట్టివేత



పోలీసులు పట్టుకున్న లారీ, బియ్యం

గోపవరం : మండలంలోని పి.పి.కుంట చెక్‌పోస్టు వద్ద శనివారం రాత్రి రూ.11 లక్షల విలువ చేసే 600 బస్తాల చౌక బియ్యాన్ని పోలీసులు పట్టుకున్నారు. మైదుకూరు నుంచి కృష్ణపట్నం పోర్టుకు 600 బస్తాల లోడుతో లారీ వెళుతుండగా.. పి.పి.కుంట చెక్‌పోస్టు వద్ద వాహనాల తనిఖీలో భాగంగా బద్వేలు రూరల్ ఎస్‌ఐ చంద్రశేఖర్, సిబ్బంది పట్టుకుని స్వాధీనం చేసుకున్నారు. మైదుకూరుకు చెందిన శ్రీరామ్‌శ్రీనివాస్ అనే వ్యాపారి ఈ అక్రమ రవాణాకు పాల్పడగా.. అతనిని కూడా అదుపులోకి తీసుకున్నారు. రూ.11 లక్షల విలువ చేసే రేషన్ బియ్యంతోపాటు రూ.12 లక్షల విలువ చేసే లారీని కూడా సీజ్ చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు. ఈ బియ్యాన్ని రెవెన్యూ అధికారులకు అప్పగించగా, వ్యాపారి శ్రీరామ్‌శ్రీనివాస్‌పై కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరిచారు.

ఆటో, బైక్ ఢీకొని ఒకరి మృతి

మరో ఇద్దరికి గాయాలు



బోల్తా పడిన ఆటో

కలికిరి : కలికిరి సమీపంలో ఆదివారం ఆటో, బైక్ ఢీకొనడంతో ఓ వ్యక్తి మృతి చెందగా, ఇద్దరు గాయాల పాలయ్యారు. వివరాలు ఇలా ఉన్నాయి. సోమల మండలం కందూరు నుంచి బియ్యం బస్తాలను ఆటోలో కలికిరికి తరలిస్తుండగా.. కలికిరి సమీపంలో ఓ మలుపు వద్ద ఎదురుగా బైక్ వచ్చింది. ఈ రెండు వాహనాలు ఢీకొన్నాయి. బియ్యం బస్తాలతో ఉన్న ఆటో బోల్తా పడింది. ఆటో డ్రైవరు దామోదర్ స్వల్ప గాయాలతో బయటపడగా, ఆటోలో ప్రయాణిస్తున్న గుట్టపాళెం గ్రామం ఎ.గొల్లపల్లికి చెందిన సురేంద్ర(25), సోమలకు చెందిన ద్విచక్రవాహనదారుడు మహేంద్ర తీవ్ర గాయాల పాలయ్యారు. స్థానికుల సమాచారం మేరకు 108 సిబ్బంది రమణ, చంద్రబాబు సంఘటన స్థలానికి చేరుకుని సురేంద్ర, మహేంద్రను పీలేరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం తిరుపతికి తరలిస్తుండగా మార్గంమధ్యలో సురేంద్ర మృతి చెందాడు. మహేంద్ర తిరుపతిలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

దైవ దర్శనానికి వెళ్తుండగా..

- కారును ఢీకొన్న లారీ
- ఇద్దరు మృతి
- ఐదుగురికి గాయాలు



ప్రమాదానికి కారణమైన లారీ



దెబ్బతిన్న కారు



వంశీకృష్ణ (ఫైల్)



నరేంద్ర (ఫైల్)

ఒంటిమిట్ట : అన్నమయ్య జిల్లా రాజంపేట నియోజకవర్గం ఒంటిమిట్ట మండల పరిధి మంటపంపల్లె పంచాయతీలోని మంగంపేట గ్రామం వద్ద ఆదివారం తెల్లవారుజామున ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. దైవ దర్శనానికి వెళ్తున్న వారి కారును ఎదురుగా వస్తున్న లారీ ఢీకొంది. ఈ ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న ఇద్దరు మృతి చెందగా, ఐదుగురికి గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. తెలంగాణ రాష్ట్రం మహబూబ్‌నగర్ జిల్లా భూత్పూర్ మండలం అమిత్‌షాపూర్ గ్రామంలోని ఒకే కుటుంబానికి చెందిన ఏడుగురు శ్రీవెంకటేశ్వరస్వామి దర్శనార్థం కారులో తిరుమల వెళ్తున్నారు. అన్నమయ్య జిల్లా ఒంటిమిట్ట మండల పరిధి మంటపంపల్లె పంచాయతీలోని మంగంపేట గ్రామం ఆంజనేయస్వామి గుడి సమీపాన ఉన్న కడప– చెన్నై జాతీయ రహదారిపైకి రాగానే.. రాజంపేట నుంచి కడప వైపు వస్తున్న లారీ ఢీకొంది. ఈ ప్రమాదంలో కారు నుజ్జునుజ్జు అయింది. దీంతో కారులోని వంశీకృష్ణ(24) అక్కడికక్కడే మృతి చెందాడు. హనుమంతు(24), కృష్ణవేణి(20), బిందేశ్వరి(19), రాము(25), నరేంద్ర(24)కు తీవ్రంగా, వెంకటేష్(23)కు స్వల్ప గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న ఒంటిమిట్ట ఎస్‌ఐ మధుసూదన్‌రావు తమ సిబ్బందితో కలిసి ఘటనా స్థలానికి చేరుకున్నారు. బాధితులను 108 సాయంతో కడప రిమ్స్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతున్న వారిలో నరేంద్ర(24) పరిస్థితి విషమించడంతో మృతి చెందాడు. వారంతా ఒకే కుటుంబానికి చెందిన వారు కావడంతో బంధువులు, గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. ఈ ఘటనపై ఎస్‌ఐ మధుసూదన్‌రావు కేసు నమోదు చేశారు. ప్రమాదానికి కారణమైన లారీని అదుపులోకి తీసుకుని, పరారీలో ఉన్న డ్రైవర్ కోసం గాలింపు చర్యలు చేపట్టారు.

ముగ్గురి ఆత్మహత్యాయత్నం

మదనపల్లె : వేర్వేరు ప్రాంతాల్లో ముగ్గురు వ్యక్తులు ఆత్మహత్యకు ప్రయత్నించారు. గుర్రంకొండ మండలం తరిగొండకు చెందిన టి.నవీన్‌కుమార్(27) కుటుంబ సభ్యులతో గొడవపడ్డాడు. ఆయన మనస్తాపంతో శనివారం రాత్రి విష ద్రావణం తాగి ఆత్మహత్యకు యత్నించాడు. గమనించిన కుటుంబ సభ్యులు 108 అంబులెన్స్‌లో మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు పరిస్థితి విషమంగా ఉండటంతో తిరుపతికి రెఫర్ చేశారు. రామసముద్రం మండలం బూరగమాకులపల్లెకు చెందిన భాస్కర్ భార్య డి.ఉమ(25) కడుపునొప్పి తాళలేక ఆదివారం ఉదయం ఇంట్లోనే పురుగుల నివారణ మందు తాగి ఆత్మహత్యకు ప్రయత్నించింది. బాధితురాలు అపస్మారకస్థితిలో ఉండగా గమనించిన కుటుంబ సభ్యులు మదనపల్లె ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. చికిత్సల అనంతరం కోలుకుంటోంది. పట్టణంలోని మార్పురివీధికి చెందిన గౌరీభాయి(20) అనారోగ్యం భరించలేక ఆదివారం ఇంట్లోనే క్రిమిసంహారిణి మందు తాగి ఆత్మహత్యకు ప్రయత్నించింది. గమనించిన కుటుంబ సభ్యులు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. టూటౌన్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.